

# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 128-

# పగ

**అరేబియా ఎడారిలో** సూర్యుడు కళ్ళు మిరుమిట్లు గొలిపేలా ప్రకాశిస్తున్నాడు. కువైట్ నగర శివార్లలో ఉన్న షేక్ అల్-హమద్ విలాసవంతమైన భవనం, బయటి ప్రపంచానికి సంపదకు, శాంతికి ప్రతీక. అదొక విలాసవంతమైన ప్యాలస్.

కానీ దాని రాతి గోడల వెనుక వున్న ఇద్దరు యువతుల గుండెల్లో అంతులేని ఆశలు, ఆశయాలు దాగి ఉన్నాయి.

అక్క అంజలి, చెల్లి కీర్తి. వారి పట్టుదలకు పల్లెటూరి పేదరికం, కటిక దారిద్ర్యం పునాదులు వేశాయి. ఇక్కడ కష్టపడితే, తమ కుటుంబానికి మంచి జీవితాన్ని అందించవచ్చని, చెల్లెళ్ల పెళ్లిళ్లు చేయొచ్చని, తల్లిదండ్రులకు ఆసరాగా నిలవవచ్చని వారి కల. వారి కళ్ళలో ఒకే ఒక ఆశ, ఆ కలలు నెరవేర్చుకోవడానికి కువైట్ ఒయాసిస్సు లాంటిది.

తెలుగు రాష్ట్రాలనుండి పనివారు కువైట్ రావడానికి కారణం అక్కడి దినారు విలువైనది కావడం.

అంజలి స్వతహాగా ధైర్యవంతురాలు, బుద్ధిశాలిని. ప్రతి చిన్న పనిలోనూ జాగ్రత్త వహించేది.

కీర్తి అమాయకురాలు, సున్నితమైన మనసున్నది. ఆమె ముఖంలో ఎప్పుడూ ఒక చిరునవ్వు ఉండేది. వారిద్దరూ షేక్ ఇంట్లో పనిలో కుదురుకున్నారు. అంజలి ముఖ్యంగా ఇంటి పనులను, వంటగది వ్యవహారాలను చూసుకోగా, కీర్తి షేక్ భార్య అమీనా వ్యక్తిగత పనుల్లో సహాయపడుతుండేది.

షేకుకు నలుగురు ఆడపిల్లలు ఒక కొడుకు వుండేవాడు. అతడి పేరు సలీమ్. యువకుడు, అందగాడు, కానీ అతని కళ్ళల్లో ఒక రకమైన అహంకారం, నిర్లక్ష్యం ఎప్పుడూ కనిపించేవి. తనకంటూ ఒక లోకం, ఆ లోకంలో తానే రాజు అన్నట్టు వుంటుంది అతని వ్యవహారం.

కొన్ని నెలల పాటు సాఫీగా సాగిన వారి జీవితంలోకి అనుకోకుండా చీకటి నీడలు అలుముకున్నాయి. సలీమ్ కీర్తి అమాయకత్వానికి సౌందర్యానికి ఆకర్షితుడయ్యాడు. యవ్వనం, వయసు అలాంటివి. నెమ్మదిగా, బెదిరింపులు, ప్రలోభాలతో కూడిన ఒక సంబంధం వారి మధ్య ఏర్పడింది.

కీర్తి భయంతో, లోలోపల కుమిలిపోతూ ఈ రహస్యాన్ని అంజలి నుంచి దాచి ఉంచింది. తన అక్కకు బాధ కలగకూడదని ఆమె భావించింది.

కానీ అంజలికి ఈ విషయం తెలుసని గ్రహించలేకపోయింది.

రోజూ రాత్రివేళల్లో నిశ్శబ్దంగా మంచం దిగిన కీర్తి సలీం గదిలోకి వెళ్ళడం అంజలి గమనించేది. అయినా తెలియనట్లు మౌనంగా వుండేది. ఎందుకంటే ఇక్కడ పనిమనుషులు బానిసల్లాంటి వారు. సలీం కు ఎదురు తిరిగితే ఏం జరుగుతుందో తెలియదు.

మొదట్లో కీర్తి సంతోషంగా కనిపించేది. ఆ తరువాత దిగులుగా కనపడేది. ఎందుకో అంజలికి అర్థం కాలేదు. ఒకరోజు కీర్తి వాంతి చేసుకోవడం గమనించింది. నిలదీసి అడిగింది అంజలి. భయపడుతూనే విషయం వివరించింది కీర్తి.

కీర్తి గర్భవతి అని తెలియగానే నిర్ఘాంతపోయింది అంజలి. ఇప్పుడు ఏం చేయడం? సలీం నే పరిష్కారం అడగమంది అంజలి.

"అలాగే" తలూపింది కీర్తి.

పదిరోజుల తరువాత ఒక రాత్రి, భవనం అంతా నిశ్శబ్దంగా ఉంది.

సలీం గది నుండి బలమైన అరుపులు వినిపించాయి. అవి చీకటిని చీల్చుకుంటూ అంజలి చెవుల్లోకి దూసుకెళ్ళాయి. అంజలి ఉలిక్కిపడి లేచింది. భయంతో ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది.

సందేహం లేదు అవి కీర్తి అరుపులే. ఆమె సలీం గది వైపు పరుగెత్తింది. తలుపు సందులోంచి లోపలి దృశ్యం ఆమెను నిర్ఘాంతపరిచింది. లోపల, సలీమ్, కీర్తి మధ్య తీవ్ర వాగ్వాదం జరుగుతోంది. సలీమ్ కోపంతో ఊగిపోతున్నాడు, అతని ముఖం ఎర్రబడింది. "నువ్వు నా మాట వినాల్సిందే! లేకపోతే నీ జీవితం ఇక్కడితో అంతం అవుతుంది!" అని అతను అరుస్తున్నాడు, అతని కళ్ళల్లోని క్రూరత్వం స్పష్టంగా కనిపించింది. కీర్తి ఏడుస్తూ, ప్రాధేయపడుతోంది. ఆమె మాటలు గద్గదమయ్యాయి. "దయచేసి నన్ను వదిలేయండి, సలీమ్!

నాకు అబార్షన్ వద్దు. నేను ఈ విషయం మీ అమ్మకు చెప్పేస్తాను!" అంటోంది.

ఆమె మాట పూర్తి కాకముందే, సలీమ్ కోపంతో కీర్తిని బలమైన దెబ్బ కొట్టాడు. కీర్తి బలహీనమైన శరీరం నేలకూలింది. ఆమె తల గట్టిగా గోడకు తగిలింది.

ఒక్కసారిగా అంతా నిశ్శబ్దం. సలీమ్ భయంతో చూశాడు. కీర్తి కదలకుండా పడి ఉంది. ఆమె తల కింద రక్తం చిన్నపాటి కొలనులా ఏర్పడింది. అంతా నిముషంలో జరిగిపోయింది.

అంజలి గుండె ఆగిపోయినంత పనైంది. ఆమెకు మాట రాలేదు, కదల్లేకపోయింది.

భయం, కోపం, నిస్సహాయత ఆమెను కమ్మేశాయి. ఆమె కళ్ళముందే ఆమె చెల్లి ప్రాణాలు కోల్పోయింది. కీర్తి అని అరుస్తూ అంజలి స్పృహ తప్పి పడిపోయింది.

కీర్తి మరణించింది అది కూడా సలీమ్ చేతుల్లో. ఆ అరుపులకు ఇంట్లో వాళ్ళంతా పరిగెత్తి వచ్చారు.

కీర్తి మరణవార్త షేక్ అల్-హమద్ కుటుంబాన్ని కుదిపేసింది. షేక్ కుటుంబ పరువుకు ఇది పెద్ద దెబ్బ. అరేబియా సమాజంలో ఇలాంటి వార్తలు వారి ప్రతిష్టను మంటగలుపుతాయి. షేక్ వెంటనే రంగంలోకి దిగాడు. అతని అనుచరులు, అధికారులు అప్పటికప్పుడే కీర్తి మరణాన్ని ప్రమాదవశాత్తు జరిగినట్లు చిత్రీకరించారు. ఆమె మెట్లపై నుండి జారిపడిందని, తలకు బలమైన దెబ్బ తగలడంతో మరణించిందని కథ అల్లారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి పంపించారు. అంజలి, కళ్ళముందే జరిగిన దారుణాన్ని చూసి కూడా ఏమీ చేయలేకపోయింది. షేక్ డబ్బు, పలుకుబడి, రాజ్యాంగ నియమాలు ఆమెను బంధించాయి. పోలీసుల విచారణ కూడా ఒక నాటకంలా ముగిసింది. ఎటువంటి అనుమానాస్పద వివరాలు వెలుగులోకి రాలేదు.

సలీమ్‌కు ఎటువంటి కేసు లేకుండా, క్లీన్‌చిట్ లభించింది. అతను ఎప్పటిలాగే నిర్లక్ష్యంగా తన జీవితాన్ని కొనసాగించాడు.

అంజలిని హాస్పిటల్లో చేర్పించారు. కొద్దిరోజులకు కోలుకుని ఇంటికి వచ్చింది. కానీ మామూలు మనిషి కాలేకపోయింది. అంజలి గుండెలో పగ జ్వాలలా రగిలింది. అది నిప్పుకణికలా ఆమె అంతరాత్మను దహించింది.

చెల్లి నిర్జీవ దేహాన్ని ఆమె నిస్సహాయతను గుర్తు చేసుకున్న ప్రతిసారీ, సలీమ్‌ను చంపాలనే కసి ఆమెలో పెరిగింది. ఆమె బాహ్యంగా ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించినా, లోపల ప్రతీకారం కోసం ఒక క్రూరమైన ప్రణాళికను రూపొందించుకుంది.

కీర్తి లేని లోటును, ఆ బాధను దిగమ్రింగుతూ ఒంటరిగా కొన్ని నెలల పాటు, అంజలి షేక్ ఇంట్లో తన పనిని కొనసాగించింది. ఆమె కళ్ళలో కసి, కోపం ఒక ఉద్దేశం దాగి ఉన్నాయి.

సలీమ్‌తో గతంలో కంటే మరింత దగ్గరగా ఉండేందుకు ఆమె ప్రయత్నించింది. అతని దినచర్యను, బలహీనతలను, అలవాట్లను నిశితంగా పరిశీలించింది.

సలీమ్ తనను నమ్మడం మొదలుపెట్టాడు. అతను కీర్తి మరణాన్ని పూర్తిగా మరచిపోయినట్లు, లేదా కనీసం పట్టించుకోనట్లు వ్యవహరించాడు. అతని నిర్లక్ష్యం, అహంకారం అంజలి కోపాన్ని మరింత పెంచాయి.

ఒకరోజు, షేక్ కుటుంబం ఒక ముఖ్యమైన కార్యక్రమం నిమిత్తం నగరం వెలుపల వున్న షాలే కి వెళ్ళింది. ఇంట్లో పనివారు మాత్రమే ఉన్నారు. సలీమ్ ఎప్పటిలాగే తన గదిలో కూర్చుని స్నేహితులతో ఫోన్ లో మాట్లాడుతున్నాడు. రాత్రి పది గంటల సమయం. ఆ సమయంలో ఇల్లు సాధారణంగా నిర్మానుష్యంగా ఉంటుంది. అంజలి తన పథకాన్ని అమలు చేయడానికి ఇదే సరైన సమయం అని నిర్ణయించుకుంది. ఆమె వంటగది నుండి పదునైన చాకును తీసుకుంది. దానిని జాగ్రత్తగా ఒక వస్త్రంలో చుట్టి, తన దుస్తుల కింద దాచుకుంది. ఎవరూ చూడకుండా చీకటిలో సలీం గది వైపు వెళ్ళింది. ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది, ప్రతి అడుగు ఆమెను ప్రతీకారం వైపు నడుపుతోంది. ఆమె ముఖంపై ఎటువంటి భావోద్వేగాలు లేవు, ఒక నిశ్చలమైన కసి తప్ప.

గది ద్వారం వద్ద ఆగి, లోపలికి చూసింది. సలీమ్ ఫోన్ లో లీనమై ఉన్నాడు. అతని వెనుక భాగం ఆమెకు స్పష్టంగా కనిపించింది. అంజలి లోపలికి అడుగుపెట్టింది. ఆమె అడుగుల చప్పుడు విని సలీమ్ ఆమెను చూడగానే ఆశ్చర్యపోయాడు.

"అంజలి! ఇక్కడ ఏమిటి ఈ సమయంలో?" అని అడిగాడు, అతని గొంతులో అనుమానం ధ్వనించింది. అంజలి బలవంతంగా నవ్వింది.

"సార్, మీకు వేడి పాలు తీసుకువచ్చాను. మీరు తరచుగా రాత్రిపూట నిద్రపోవడానికి ముందు తాగేవారు కదా," అంది. ఆమె గొంతులో ఎటువంటి వణుకూ లేదు. సలీమ్ అనుమానించలేదు.

"ఓహ్, అవును. షుక్రియా," అంటూ పాలు తీసుకున్నాడు. అతను ఒక క్షణం కూడా ఆలోచించలేదు.

పాలు తాగుతుండగా, సలీమ్ అంజలితో కబుర్లు చెప్పడం ప్రారంభించాడు. కీర్తి గురించి మాటాడుతుంటే, అంజలి ముఖంలో విషాదం నిండిపోయింది.

"కీర్తి లేని లోటు నాకు ఇంకా ఉంది సలీం," అంది, ఆమె కళ్ళల్లో బాధ కనిపించింది. సలీమ్ నిర్లక్ష్యంగా భుజాలు ఎగరేసాడు.

"జీవితం అంటే అంతే అంజలి. ఎవరూ శాశ్వతం కాదు," అన్నాడు, అతని స్వరం చులకనగా ఉంది. అతని మాటలు అంజలి కోపాన్ని తారాస్థాయికి చేర్చాయి.

"నా చెల్లిని చంపి, ఇప్పుడు ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నావా?" ఇదే సరైన సమయం అని ఆమెకు అనిపించింది.

సలీమ్ పాలు తాగి గ్లాసును టేబుల్ పై పెట్టాడు. ఒక క్షణం అతను దృష్టి మళ్ళించాడు. అది చాలు.

అంజలి మెరుపులా కదిలింది. ఆమె కళ్ళల్లో పగ జ్వాల ప్రజ్వలించింది. తన దుస్తుల కింద దాచిన చాకును తీసి, సలీమ్ గుండెలపై బలంగా పొడిచింది. అతని చర్మంలోకి అది సులభంగా చీల్చుకుపోయింది. సలీమ్ కేక పెట్టడానికి

కూడా సమయం చిక్కలేదు. అతని శ్వాస ఆగిపోయింది. అతను ఆశ్చర్యంతో, భయంతో అంజలిని చూశాడు. అతని కళ్ళల్లో ప్రాణం పోతున్న క్షణం స్పష్టంగా కనిపించింది. చాకు అతని శరీరంలోకి లోతుగా దిగబడింది. రక్తం సెలయేరులాగా అతని శరీరం నుండి పొంగింది. సలీమ్ కుర్చీలోంచి కిందపడ్డాడు. అతని గిలగిలా శరీరం కొట్టుకుంది. అంజలి కళ్ళల్లో ఎటువంటి పశ్చాత్తాపం లేదు, కేవలం నిశ్చలమైన పగ, పగ తీర్చుకున్న సంతృప్తి మాత్రమే ఉంది.

సలీమ్ ప్రాణం పోయింది. అంజలి అక్కడే నిలబడి ఉంది, ఆమె శరీరం అంతా చెమటతో తడిసిపోయింది. తన ప్రతీకారం నెరవేరింది. ఆమె హృదయం ఒక క్షణం ప్రశాంతంగా అనిపించింది. కానీ ఆ ప్రశాంతత క్షణికమే. ఇప్పుడు ఆమె తన చర్యలకు పరిణామాలు ఎదుర్కోవాలి. అంజలి చాకును సలీమ్ చేతిలో పెట్టింది. గదిని చిందరవందర చేసింది పుస్తకాలు నేలపై చెల్లాచెదురుగా పడేసింది. కుర్చీలు పడేసింది.

సలీమ్ ను ఎవరో బయటి వ్యక్తి వచ్చి పొడిచాడని నమ్మించడానికి ప్రయత్నించింది.

ఆమె వెంటనే ఆ గదినుండి బయటకు వచ్చి, భయంతో అరుస్తూ, "సలీమ్ ను ఎవరో చంపేశారు." అని కేకలు వేసింది. ఆమె నటన చాలా సహజంగా ఉంది, ఒక అవార్డు గెలుచుకున్న నటిలా.

మిగిలిన పనివారందరూ భయంతో ఆ గది వైపు పరుగెత్తారు.

పోలీసులు వచ్చారు. అదే అప్పటి ఇన్‌స్పెక్టర్ ఫైసల్ వచ్చాడు. అతని కళ్ళల్లో ఆశ్చర్యం. షేక్ ఇంట్లో మళ్ళీ ఒక హత్య. కానీ ఈసారి మృతుడు షేక్ కొడుకు. ఈ భవనానికి ఏమైంది? ఫైసల్ అనుమానించాడు. ఫైసల్ ప్రతి చిన్న వివరానికీ ప్రాధాన్యతనిచ్చాడు. సలీమ్ చేతిలో చాకు, గది చిందరవందరగా ఉండటం, అంజలి నటించిన భయం ఇవన్నీ అతనిని అయోమయంలో పడేశాయి. అంజలిని ప్రశ్నించాడు. ఆమె చాలా ప్రశాంతంగా, ఏమీ తెలియని దానిలా మాట్లాడింది, తన మాటలను జాగ్రత్తగా ఎంచుకుంది.

ఫైసల్ సున్నితంగా విచారణ సాగించాడు. అంజలి మాటలు, ఆమె ప్రవర్తనలో ఏదో అబద్ధం ఉందని అతనికి అనిపించింది. కీర్తి కేసులో అంజలి నిస్సహాయంగా, బాధతో కృంగిపోయింది. ఇప్పుడు ఆమె చాలా ధైర్యంగా, తన మాటలపై నమ్మకంతో ఉంది. ఫైసల్ మృతదేహాన్ని పరిశీలించాడు. చాకు పట్టుకున్న విధానం, గాయం లోతు, రక్తం చిందరవందరగా ఉన్న విధానం ఇవి సలీమ్ ఆత్మహత్య చేసుకున్నాడని లేదా బయటి వ్యక్తి చేశాడని సూచించడం లేదు. చాకు పట్టుకున్న కోణం, బలం ఒక బలమైన వ్యక్తి ద్వారా జరిగినట్లుగా ఉంది. సలీమ్ చేతిలో చాకు పెట్టబడింది. అది హత్యను ప్రమాదవశాత్తు లేదా ఆత్మహత్యగా చూపించడానికి చేసిన ప్రయత్నం.

ఫైసల్ అంజలిని మళ్ళీ ప్రశ్నించాడు, ఈసారి సూటిగా. అతని కళ్ళల్లో తీవ్రత కనిపించింది. "కీర్తి ఎలా చనిపోయిందో నీకు తెలుసు కదా, అంజలి?" అని అడిగాడు. అంజలి కళ్ళు ఒక్కసారిగా విస్తరించాయి.

ఆమె మెదడులో భయంకరమైన దృశ్యాలు కదిలాయి. సలీమ్ కీర్తిని కొట్టడం, ఆమె నేలకూలడం, రక్తం కారుతున్న క్షణం.

"నాకు తెలియదు సార్. ఆమె ప్రమాదవశాత్తు చనిపోయింది," అని అంజలి బలహీనంగా, వణుకుతున్న గొంతుతో అంది.

"అబద్ధం!" ఫైసల్ అరిచాడు, అతని గొంతు గదిలో ప్రతిధ్వనించింది.

"నువ్వు అక్కడే ఉన్నావు కదా, అంజలి? నువ్వు చూశావు. సలీమ్ కీర్తిని చంపినట్లు చూశావు. అందుకే నువ్వు ప్రతీకారం తీర్చుకున్నావు. సలీమ్‌ను నువ్వే చంపావు." ఫైసల్ కళ్ళల్లో పదునైన చూపు, అతని మాటల్లో తిరుగులేని ధీమా.

అంజలి ఇక దాచలేకపోయింది. ఆమె మోకాళ్లపై కూలబడి, ఏడుస్తూ, "అవును సార్! నేను చేశాను! నా చెల్లిని అతను చంపాడు! వాడికి శిక్ష పడలేదు! షేక్ వాడిని కాపాడాడు! నా చెల్లి ఆత్మకు శాంతి కలగాలంటే వాడి ప్రాణం పోవాలి సార్! నాకు వేరే దారి కనిపించలేదు!" ఆమె అరుపులు ఆ భవంతిలో ప్రతిధ్వనించాయి, అవి కేవలం ఏడుపు కాదు, న్యాయం కోసం పడే ఆవేదన.

ఫైసల్ నిశ్శబ్దంగా ఆమె మాటలు విన్నాడు. అంజలి తన నేరాన్ని ఒప్పుకోవడం. ఆమె కళ్ళల్లో అలుముకున్న ఆక్రోశం, నిస్సహాయత అతనికి స్పష్టంగా కనిపించాయి.

కువైట్ షేక్ ఇంట్లో జరిగిన ఈ రెండు హత్యలు నగరాన్ని షాక్‌కు గురి చేశాయి. ఈ కేసు మీడియాలో సంచలనం సృష్టించింది. ఒక పేద పనిమనిషి తన చెల్లి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి ధైర్యంగా ఒక షేక్ కొడుకును హత్య చేయడం, న్యాయం జరగనప్పుడు ప్రజలు ఎలా ప్రతీకారం తీర్చుకుంటారో ఈ కథ చూపించింది. అంజలిని అరెస్టు చేశారు. ఆమెకు శిక్ష పడటం ఖాయం. కానీ ఆమె కళ్ళల్లో ఎటువంటి పశ్చాత్తాపం లేదు, కేవలం తన చెల్లి కోసం పగ తీర్చుకున్న తృప్తి మాత్రమే ఉంది. ఆమెకు తెలుసు, తాను చేసిన పనికి మూల్యం చెల్లించుకోవాలని.

షేక్ కుటుంబానికి ఇది అంతులేని సిగ్గును, అవమానాన్ని తెచ్చిపెట్టింది. వారి అధికారం, డబ్బు కీర్తి మరణాన్ని కప్పిపుచ్చగలిగినా, సలీమ్ మరణాన్ని అడ్డుకోలేకపోయాయి. ఈ సంఘటన కువైట్ సమాజంలో ఉన్నత వర్గాల ఇళ్లలో పనిచేసే వారి పరిస్థితులను, వారిపై జరిగే అన్యాయాలను జరిగే పరిణామాలను తీవ్రంగా ప్రశ్నించింది.

రెండు హత్యలతో

షేక్ భవనం గోడల వెనుక ఎప్పటికీ మర్చిపోలేని ఒక విషాద గాథ మిగిలిపోయింది. ఇది కేవలం రెండు హత్యల కథ కాదు, ఇది న్యాయం కోసం తపన పడిన ఒక ఆత్మ, పగతో రగిలిన ఒక గుండె, మరియు కపటమైన సంపన్న లోకపు చీకటి కోణాల కథ.

ఈ సంఘటన కువైట్‌లోని పనివారిలో ఒక ఆందోళనను, భయాన్ని కలిగించింది.

షేకు హమద్ కుటుంబం ఆ ఇంట్లో వుండలేక కన్నకొడుకు పోయిన బాధను భరించలేక ఆ ప్యాలెస్ ని వదిలి మరో ఇంటికి వెళ్ళిపోయింది.

ఆ ఇల్లు పాడుబడిపోయింది. రెండు మరణాలకు సాక్షిలా, జైల్లో శిక్ష అనుభవిస్తున్న అంజలిలా ఆ ఇల్లు కూడా శిధిలమై పోయింది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments